క్లుప్తంగా

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో సర్వే నంబర్ 532లోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. సుమారు 20 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి బండలు పాతారు. ఈ విషయంపై తహసీల్దార్ మహబూబ్ బాషాను సంప్రదించగా.. సర్వే నంబర్ 532లో ఉన్న 20 సెంట్ల స్థలం ప్రభుత్వానికి సంబంధించిందన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

22 నుంచి ఉగాది ఉత్సవాలు



ఉగాది ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి 24 వరకూ జరిగే ఉగాది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈవో వెంకటేశ్వర్రెడ్డి కోరారు. సోమవారం ఆలయ ఈవో కార్యాలయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ధనుంజయ, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు ఇతర సిబ్బందితో కలిసి ఉగాది ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న గ్రామోత్సవం, 23న రథోత్సవం, 24న లంకాదహనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుంతకల్లు: స్థానిక హనుమేష్ నగర్‌లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బోయ రాజును అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ మహేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ, సెబ్ ఏఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక, గుట్కా, పేకాట వంటి నేరాలను అదుపు చేసేందుకు దాడులు నిర్వహించమన్నారు. ఈ నేపథ్యంలో హనుమేష్ నగర్‌లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బోయ రాజు నుంచి 96 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న సుంకన్న అనే వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టి.కొత్తపల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో సోమవారం వేకువజామున గ్రామంలో దాడులు నిర్వహించారు. సుంకన్న అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ అలీ అహ్మద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సుల ఢీ

- నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



గార్లదిన్నె: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లు డిపోకు చెందిన బస్సు అనంతపురమునకు వెళ్తుండగా లోలూరు క్రాస్ స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీటీ డైరెక్టర్ చంద్రశేఖర్ నాయుడు

గార్లదిన్నె: మండల పరిధిలోని కనంపల్లిలో సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీటీ డైరెక్టర్ చంద్రశేఖర్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి, తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మారుతున్న కాలానికి అనుకూలంగా మహిళలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సమానత్వం కోసం మగవారితో పోటీ పడాలన్నారు. తల్లిదండ్రులు మగ, ఆడపిల్ల అనే తేడా లేకుండా సమానంగా చదివించాలన్నారు. అలాగే ప్రభుత్వం, ఆర్డీటీ అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ వరలక్ష్మి, కౌన్సిలర్ సునీత, ఆర్డీటీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు





యల్లనూరు: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న తాడిపత్రి డీఎస్పీ చైతన్య. గుంతకల్లుటౌన్: ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న పట్టభద్రులు

- ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు

గుంతకల్లు: పశ్చిమ రాయలసీమ (కడప, కర్నూలు, అనంతపురం) ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. గుంతకల్లు మండలంలో ఉపాధ్యాయ ఓట్లు 551 ఉండగా 509 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ 92.37 శాతంగా నమోదైంది. ఇక పట్టభద్రుల ఓట్లు 5,579 ఉండగా అందులో 4,210 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 75.46 శాతంగా నమోదైంది. టీచర్ల కోసం గుంతకల్లు మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని శ్రీ శక్తి భవన్ వెలుగు ఆఫీసులో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయగా, పట్టభద్రుల కోసం గుంతకల్లు పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 4 పోలింగ్ కేంద్రాలతో పాటు ఎంపీడీఓ, మండల రీసోర్స్ కార్యాలయాల్లోనూ ఏర్పాటు చేశారు. ఆర్డీఓ రవీంద్ర, డీఎస్పీ నరసింగప్ప తదితరులు సబ్ డివిజన్ పరిధిలో కలియతిరుగుతూ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఇక తహసీల్దార్ రాము, కమిషనర్ శేషన్న, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ హేమచంద్ర, టీవీ నారాయణ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఎస్పీ ఫక్కీరప్ప గుంతకల్లులో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి పోలింగ్ సరళిపై వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆరా తీశారు.

- గుత్తి: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సీఐ వెంకటరామిరెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలు, మోడల్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ మహబూబ్ బాషా తనిఖీ చేశారు. పోలింగ్ సరళిపై ఆరా తీశారు. మండల వ్యాప్తంగా గ్రాడ్యుయేట్ ఓట్లు 3,304 ఉండగా 2,529 పోలయ్యాయి. టీచర్స్ ఓట్లు 289 ఉండగా 270 పోలయ్యాయి. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరిశీలించారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్‌యాదవ్, మధుసూదన్ రెడ్డి, బుసా సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్యయాదవ్, కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, ఫరూక్ పాల్గొన్నారు.
- గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పట్టభద్రులు, టీచర్లు క్యూకట్టారు. పట్టణంలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్‌ను ఈసీ పర్యవేక్షించింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. గతంతో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం అధికంగా నమోదైంది.
- నార్పల: మండల వ్యాప్తంగా 1,575 పట్టభద్ర ఓటర్లు ఉండగా 1,183 మంది ఓటు వేశారు. పోలింగ్ 75 శాతం నమోదైంది. 56 ఉపాధ్యాయుల ఓట్లు ఉండగా అందులో 54 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుఉన్నారు. పోలింగ్ 96 శాతం నమోదైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ సర్పంచులు నార్పల సంజీవరెడ్డి, స్వాతిలతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్న ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- పెద్దవడుగూరు: మండలంలో 904 మంది పట్టభద్రులు ఉండగా.. 705 ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. పోలింగ్ 77.98 శాతం నమోదైంది. ఉపాధ్యాయులు 42 మంది.. 42 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ 100 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.
- పామిడి: మండలంలోని పట్టభద్రుదలు 1,773 మంది ఉండగా.. 1,385 మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 78.11 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే టీచర్స్ 122 మంది ఉండగా.. 118 మంది ఓట్లు వేశారు. దీంతో 96.72 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి పర్యవేక్షించారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ చాంద్‌బాషా, పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు.
- గార్లదిన్నె: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో పట్టభద్రుల ఓటర్ల కోసం రెండు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. 1408 పట్టభద్రుల ఓట్లు ఉండగా.. 1,077 మంది ఓటు వినియోగించుకున్నారు. 76 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 43 మంది ఉండగా 39 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 90.6 శాతం పోలింగ్ నమోదైంది. ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి గార్లదిన్నెలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని పరిశీలించారు.
- యల్లనూరు: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగింది. మండల వ్యాప్తంగా 71.6 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దారు రమాదేవి, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండల వ్యాప్తంగా 713 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా 508 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. 71 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఉపాధ్యాయ ఓట్లు 23 ఉండగా.. కేవలం 19 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 82 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ తీరును తాడిపత్రి డీఎస్పీ చైతన్య, తహసీల్దారు రమాదేవి, పుట్లూరు సీఐ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ పరిశీలించారు.
- పుట్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 835 మంది ఓటర్లు ఉండగా 650 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 18 మంది ఓటర్లు ఉండగా 17 మందిఓటు హక్కును వినియోగించుకున్నారు.
- బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, యువజన నాయకుడు ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, వైస్ ఎంపీపీ రామగోపాల్, టీడీపీ నాయకురాలు బండారు శ్రావణి తమ ఓటు హక్కును వినిగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పరిశీలించారు.
- యాడికి: మండల వ్యాప్తంగా 1,079 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 648 మంది పురుషులు, 183 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 77.10 శాతం నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్లు 48 మంది ఉండగా.. 47 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి పరిశీలించారు. వైస్ ఎంపీపీ హసీనాబేగం, డీలర్ రషీద్ దంపతులు, వార్డు సభ్యుడు రంగనాథ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- తాడిపత్రి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో మొత్తం 7 పోలింగ్ కేంద్రాలను ఓటు వేసేందుకు ఏర్పాటు చేశారు. అందులో 6 పోలింగ్ కేంద్రాలు పట్టభద్రుల కోసం, టీచర్ల కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, యువ నాయకుడు, కౌన్సిలర్ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి తదితరులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. తాడిపత్రి డీఎస్పీ వీఎన్‌కే చైతన్య ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



తాడిపత్రి: ఓటుహక్కు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



బుక్కరాయసముద్రం: వికలాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న కానిస్టేబుల్



గుంతకల్లు: ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



గుంతకల్లుటౌన్: ఓటు వేసేందుకు చంటిబిడ్డతో వచ్చిన ఓ మహిళ



పామిడి: ఓటుహక్కు వినియోగించుకున్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ వీరా



తాడిపత్రి: ఓటు వేసున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



నార్పల: ఓటు వేసేందుకు భారీగా తరలివచ్చిన పట్టభద్రులు

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 7,137 మంది ఓటర్లు ఉండగా.. 5,519 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నార న్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం చేయడమే గాక, పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లను తీసుకరావడంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, ఎంపీపీలు కృషి చేశారన్నారు. మీ కృషి వల్ల నియోజకవర్గంలో 77 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. ఇదే ఉత్సాహంతో 2024 ఎన్నికల్లో కూడా మనమంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. శింగనమల నియోజకవర్గాన్ని బహుమతిగా జగనన్నకు ఇద్దామని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: కాకినాడ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో అనంత క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 11న క్రీడా పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా నుంచి మహిళల ఫాయిల్ విభాగంలో త్రివేణి, గీతిక, జాస్పర్, పూజలు స్వర్ణ పతకాలు, ఇప్పి విభాగంలో పుష్ప, ముస్కాన్, అమీనా, సాదియాలు కాంస్య పతకాలు సాధించారు. పురుషుల సాబర్ విభాగంలో రవికుమార్, అనిల్‌కుమార్, చిన్మయిశ్రీ వాస్తవ్‌లు స్వర్ణ పతకాలను, వ్యక్తిగత ఉమెన్ ఇప్పి విభాగంలో పుష్ప స్వర్ణ పతకాన్ని, అమీనా కాంస్య పతకాన్ని, ఇప్పి పురుషుల విభాగంలో ప్రతాప్ రజత పతకాలను సాధించారు. వీరిని స్థానిక అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ, పీడీ చంద్రశేఖర్‌లు అభినందించారు.

నేటి నుంచి గార్లదిన్నె రైల్వే గేట్ మూసివేత

గార్లదిన్నె: గార్లదిన్నె డ్యాం రోడ్డులో ఉన్న రైల్వేగేట్‌ను రెండు రోజుల పాటు రైల్వే అధికారులు మూసివేస్తున్నట్లు తహసీల్దార్ ఉషారాణి, ఎస్ఐ సాగర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే గేట్‌కు మరమ్మతుల నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో తాత్కాలికంగా గేట్ మూసి వేస్తున్నట్లు తెలిపారు. అలాగే రైల్వేగేట్ అవతలి వైపు ఉన్న గ్రామాల ప్రజలు మర్తాడు మీదుగా రాకపోకలు సాగించాలని సూచించారు. ప్రయాణికులు, వాహనదారులు రైల్వే అధికారులకు సహకరించాలన్నారు.

'నాటు నాటు'కు మెడికోల స్టెప్పులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడం పట్ల అనంత ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున సందడి చేశారు. స్థానిక మెడికల్ కళాశాల ప్రాంగణంలో సోమవారం పాటకు అవార్డు కోసం పెద్ద ఎత్తున సందడి చేసిన విద్యార్థులు పాటకు అవార్డు ప్రకటించిన వెంటనే విద్యార్థులు ఇద్దరు ఇద్దరు జట్లుగా విడిపోయి పెద్ద ఎత్తున పాటకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. తెలుగు పాటకు గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

శ్రీనగర్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర

అనంతపురం కల్చరల్: శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేస్తున్న దివ్యాంగురాలైన పారా సైక్లింగ్ చాంపియన్ గీతా ఎస్ రావు సోమవారం రాత్రి అనంత చేరుకున్నారు. నగర శివార్లలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆమెకు సక్షం జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా మహిళా ప్రముఖ్ భాగ్యలక్ష్మి, అరుణ్ చైతన్య తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలో దివ్యాంగుల అభివృద్ధి జరుగుతున్న విశేషాలను ఆమెతో పంచుకున్నారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మస్థైర్యాన్ని సమాజానికి చాటడమే లక్ష్యంగా పారా సైక్లింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు కూలీలకు గాయాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారిపై డి హీరేహాళ్ మండల కేంద్రం సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం రాంపురం మండలం పైకనుమ గ్రామానికి చెందిన కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారి సమీపాన లక్ష్మీనగర్ క్యాంపు కూలి పనులకోసం వెళ్లి ఆటోలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. డి హీరేహాళ్ సమీపానకు రాగానే వేగంతో వచ్చిన ఆటో రోడ్డు డివైడర్‌ను తగిలి ముందుగా వెళుతున్న కూల్‌డ్రింక్స్ లగేజీ ఆటోను ఢీ కొట్టింది. ఘటనలో ఆటో రెండు పల్టీలు కొట్టగా, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను బళ్లారి విమ్స్ తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

పొలం తగాదాతో అన్నదమ్ముల ఘర్షణ

బొమ్మనహాళ్: మండలంలోని కానాపురం గ్రామంలో పొలం తగదాతో అన్నదమ్ములు ఘర్షణ పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల రంగప్ప, రాజేష్ అన్నదమ్ములు. వీరు కొంతకాలంగా భూతగాదాలతో గొడవ పడుతుండేవారు.. సోమవారం కూడా భూతగాదాల విషయంలో మాట మాటా పెంచుకుని ఘర్షణకు దారితీసింది. తమ్ముడు రాజేష్‌పై రంగప్ప దాడి చేసి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టామని ఎస్ఐ శివ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

యాడికి: మండలంలోని నగరూరు గ్రామంలో సోమవారం సర్పంచు రుక్మాందర రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం ఆశా ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య విబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి నగరూరు గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గుండె, ఆయాసం, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 70 మందిని మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బ్రహ్మానందరెడ్డి , ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న



మారెంపల్లి గ్రామంలో అగ్నికి అహుతైన మొక్కజొన్న

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి సమీపంలో రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట సోమవారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు గురుస్వామి తెలిపిన వివరాల మేరకు.. రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట కాలం పూర్తి కావడంతో మొక్కజొన్న కంకులను తొలగించి పొలంలో ఆరబెట్టాడు. కూతురికి సీమంతం చేయాలని పిలుచుకుని రావడానికి కళ్యాణదుర్గం సమీపంలోని బోయలపల్లికి కుటుంబసభ్యులతో కలసి ఆదివారం ఉదయం వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించడంతో కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నాడు. అధికారులు స్పందించి బాధిత రైతుకు పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శింగనమల: మండలంలోని శివపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే అనంతపురం సుందరయ్య నగర్‌కు చెందిన నారాయణ స్వామి పని మీద బైక్‌లో నాయనపల్లి క్రాస్‌కు వెళ్లాడు. తిరిగి అనంతపురానికి వస్తుండగా.. మండలంలోని శివపురం వద్ద ఉన్న స్పీడ్ బ్రేక్ వద్దకు రాగానే ముందుకు వెళ్తున్న కారు స్లో కావడంతో వెనుకనే వస్తున్న బైక్ ఢీకొంది. బైక్ మీద ఉన్న నారాయణ స్వామి కింద పడడంతో కాలు విరిగింది. చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.